క్లుప్తంగా

ప్రమాణ స్వీకార మహోత్సవం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

విజయనగరం: జిల్లా వాసవీ ఫౌండేషన్ అధ్యక్షునిగా 2023 – 24 సంవత్సరానికి మండవిల్లి వెంకటరాజు, కార్యదర్శిగా వొబ్బిలిశెట్టి ఏడుకొండలు, కోశాధికారిగా ఆకి సూర్యప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మండవిల్లి మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా చిరు వ్యాపారులుకు వడ్డీ లేని రుణాలను అందజేస్తామని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, గుడ్డ సంచులు వాడకం పట్ల అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బొడ్డు వెంకటేశ్వరరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యన్నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన



ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సాంఘికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కార్యక్రమం జరిగింది. విద్యా కమిటీ పేరుతో కెప్టెన్, వైస్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్ పేరిట ఎన్నిక జరిగింది. ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ ప్రక్రియలో ఎన్నికల అధికారిగా ఉపాధ్యాయురాలు గీత, పోలింగ్ అధికారిగా సీహెచ్ రమామణి, రిటర్నింగ్ అధికారిగా వై.అప్పారావు వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నేడు కార్పొరేషన్ సాధారణ సమావేశం

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం బుధవారం జరగనుంది. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశంలో 22 అంశాలతో తయారు చేసిన అజెండాపై కౌన్సిల్ సభ్యులు చర్చించనున్నారు. కౌన్సిల్ సభ్యులతో పాటు ఆయా విభాగాల అధికారులు విధిగా హాజరు కావాలని అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ.ప్రసాదరావు కోరారు.

విద్యుత్ కోతలు ఎత్తేయాలి

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ కోతలు ఎత్తివేయాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తరుచూ విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఏఈకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు కిల్లంపల్లి రామారావు, తాళాడ సన్నిబాబు, మొయిద పాపారావు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సంఘం నాయకులు డీటీ కోటేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, గోపాల్, రాజు, వీరాస్వామి, సన్యాసప్పడు, రాములప్పడు, పెంటయ్య, గౌరీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చేసిన మేలును చెబుతున్నాం..



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని, వాటిని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి చెప్పే ధైర్యం తమకి ఉందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్పష్టం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి తమ పరిధిలోని అందిస్తున్న పథకాలు, వారి బాధ్యతలు, పనితీరును తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నింపారని నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పథకాలు అందుతున్నాయని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వార్డు పరిధిలో పలువురు మహిళలు ఎమ్మెల్యేకు వివిధ సమస్యలు చెప్పగా తక్షణమే పరిష్కరించాలని కమిషనర్ బాలాజీప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్లన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, కార్పొరేషన్ల డైరెక్టర్లు జానా ప్రసాద్, రేగాన శ్రీను, మద్దిల వాసు, నౌపాడ శ్రీను, కౌన్సిలర్లు సంధ్యారాణి, మైపాడ ప్రసాద్, చిక్కాల సంతోష్, తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కార్మిక పోరాటాలు చేస్తాం..



కార్మిక నేతలను సత్కరిస్తున్న నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: కామ్రేడ్ బుగత సూరిబాబు పోరాట స్ఫూర్తితో ప్రజా కార్మిక పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. కామ్రేడ్ బుగత సూరిబాబు తృతీయ వర్ధంతి సభ స్థానిక అమర్‌భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముందుగా సూరిబాబు చిత్రపటానికి నాయకులు, కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరిబాబుతో కలిసి ఉద్యమంలో పని చేసిన అప్పలరుబోతు జగన్నాథం, పొందూరు రాంబాబు, అప్పలరాజు, వి.కొండలరావులను సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఎస్.రంగరాజు, బాయి రమణమ్మ, బుగత పావని తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో జరభద్రం

నెల్లిమర్ల రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ప్రజలను ఆరోగ్య శాఖాధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరం లక్షణాలు ఉన్న వారందరి రక్తాన్ని సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఇంటింటికీ డాక్టర్లు రావడంతో అక్కడికక్కడే రోగులు పరీక్షలు చేయించుకొని మందులు వాడుతున్నారు. జ్వరం నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు సిబ్బంది పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. సీజనల్ జ్వరాలపై అంతా అప్రమత్తంగా ఉండాలని సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి నందిని సూచించారు.

165 కొత్త పింఛన్ల మంజూరు

బాడంగి: మండలానికి 165 కొత్త పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. కొత్త లబ్ధిదారుల పరిశీలన చేపట్టినట్టు చెప్పారు. పరిశీలనకు తనతో పాటు ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఎంఈఓ-2 ఎం.రాజేశ్వరి మూడు బృందాలుగా ఏర్పడినట్టు తెలిపారు. వీరికి సెప్టెంబర్ నెలలో పింఛన్లు అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

ప్రజా స్పందనే ప్రభుత్వ పాలనకు నిదర్శనం



43వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం

విజయనగరం: ప్రజా స్పందనే ప్రభుత్వ పాలనకు నిదర్శనంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిలు పేర్కొన్నారు. నగరంలోని 43వ డివిజన్ కంటోన్మెంట్ ఉడా కాలనీ ప్రాంతంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జిలు కోలగట్ల తమ్మన్నశెట్టి, డాక్టర్ వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందలేని వారి వివరాలు తెలియజేయాలని కోరారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జిలు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. కార్పొరేటర్ దాసరి సత్యవతి మాట్లాడుతూ నవరత్నాలు అమల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలను అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరంలో అనేక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక నిర్మూలనే ధ్యేయం



ప్రయాణికులకు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు

విజయనగరం టౌన్: బాల కార్మిక నిర్మూలనే ధ్యేయంగా రైల్వే శాఖ పని చేస్తోందని విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు పేర్కొన్నారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, కార్మికశాఖ అధికారులు, ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఎన్‌జీఓలతో కలిసి మంగళవారం రైల్వేస్టేషన్‌లోని ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లోని ఫుడ్‌ట్రాక్, స్టాల్స్, పార్శిల్స్ కార్యాలయాలు, ఫ్లాట్‌ఫామ్‌లలో బాలకార్మికులు ఎవరైనా ఉంటే చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఎవరికైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 139కి గానీ, 1098కి గానీ సమాచారమందించాలని కోరారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్ఐ రవివర్మ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎటి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి



అవగాహన కల్పిస్తున్న సెంచూరియన్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరు అవయవ దానానికి ముందుకు రావాలని చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవయవ దానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన తరువాత కూడా మరో నలుగురికి మన అవయవాలు ఉపయోగపడతాయని, విలువైన అవయవాలను మట్టి పాలు చేయొద్దన్నారు. అనంతరం అవయవ దానానికి ముందుకొచ్చిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మెన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



రేగిడి ఆమదాలవలసలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబఖండి, సంకిలి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలసలో ఆలయ పూజారి కిన్నెర కాంతం అన్నారావు ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేసి, దైవదర్శనం చేసుకున్నారు.

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి, మందరాడ, పోతులజగ్గపేట గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదంపతులు, మహిళలు పాల్గొని, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో రూపొందించిన ఆహా హోటల్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఇక్కడి రైల్వేస్టేషన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించి మెప్మా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

రేగిడి: మానవ సేవే మాధవ సేవ అని ప్రతిఒక్కరూ మానవ సేవ చేసేందుకు ముందుకు రావాలని ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో ఆస్పత్రికి వచ్చిన గర్భిణులకు సత్యసాయి భక్తులు నారాయణసేవ చేశారు. ఆయన మాట్లాడుతూ సాయిరాం భక్తులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుపై విచారణ

బాడంగి: మండలానికి ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.35లక్షల్లో రూ.4.9లక్షలు మండల పరిషత్ కార్యాలయ ముస్తాబుకు మళ్లించారన్న లోకాయుక్తకు ఫిర్యాదు అందడంతో సీఈఓ(ఇన్‌చార్జి) కె.రాజ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. అప్పటి ఎంపీడీఓ అక్కారావు మండల సర్వసభ్య సమావేశంలో అటెండెన్స్ రిజిస్టర్‌లో ఎంపీటీసీ సంతకాలనే తీర్మానంగా చూపించి తమకు తెలియజేయకుండా నిధులు మళ్లించి ఖర్చు చేశారని వాడాడ ఎంపీటీసీ రెడ్డి సునీత లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జి సీఈఓ విచారణ చేసి వివరాలు తెలుసుకున్నారు. విచారణకు బదిలీ ఎంపీడీఓ అక్కారావు, ప్రస్తుత ఎంపీడీఓ ఆంజనేయులు హాజరయ్యారు.

ఈ - క్రాప్ నమోదు చేసుకోవాలి



పెరుమాళిలో ఈ-క్రాప్ నమోదు

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని రైతులంతా ఖరీఫ్ సీజన్‌లో వారు సాగు చేస్తున్న పంటలకు ఈ - క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ జి.సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ గ్రామ వ్యవసాయ సహాయకులు మంగళవారం నమోదు చేస్తున్న ఈ - క్రాప్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో 20,260 ఎకరాల్లో ఈ ఏడాది ఈ - క్రాప్ నమోదు చేయాల్సి ఉండగా, ఇంతవరకు 2,778 ఎకరాల్లో ఈ - క్రాప్ నమోదు పూర్తయ్యిందని తెలిపారు. రైతులు తాము పండిస్తున్న పొలం వద్దకు వెళ్లకుండా ఈ - క్రాప్ నమోదు చేయడం కుదరదని చెప్పారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు తాము పండించే పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించుకొనేందుకు అవకాశం ఉండదన్నారు. రైతులు వీఏఏల ద్వారా ఈ-క్రాప్ నమోదు త్వరితగతిన చేయించుకోవాలని అన్నారు.

కళలను పరిరక్షించాలి : కోలగట్ల



డిప్యూటీ స్పీకర్ కోలగట్లను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం: ఉత్తరాంధ్రకే వన్నె తెచ్చిన ఎన్నో కళలు నేడు మరుగున పడుతున్నాయని, వాటిని పరిరక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని ఏపీ శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ప్రపంచ జానపద కళల దినోత్సవం సందర్భంగా విజయనగరం రాగ సుధా రంగస్థల వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుర్రకథల పోటీలు నిర్వహించారు. విజయనగరం బుక్క వీధిలో గల ఆర్య సోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో మంగళవారం జరిగిన పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు బుర్రకథ బందాలు పాల్గొని ప్రదర్శనలిచ్చాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపసభాపతి కళాబృందాల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి, నిర్వాహకులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. జానపద కళ అనేది ఎంతో శ్రమ, పట్టుదల ఉంటే గానీ చేయలేమని, అలా చేసే వారిని ప్రోత్సహించేలా చూడాలని అన్నారు. ప్రాచీన జానపద కళారూపంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకప్పుడు విశేష ప్రజాదరణ పొందిన బుర్రకథ... టీవీ మాధ్యమం ప్రజల్లోకి వచ్చాక కాస్త ఆదరణ కోల్పోయిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల తర్వాత కొన్ని కళారూపాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదానికి చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళలను బతికించేందుకు, కళాకారులను ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే సీఎం లక్ష్యం

- విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి
- సారిపల్లి టిడ్కో కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు, పత్రాల పంపిణీ



టిడ్కో లబ్ధిదారులకు ఇంటి తాకాలు, పత్రాలు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ రాజేష్

విజయనగరం: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను మంగళవారం ఆమె అందజేశారు. వాస్తవానికి ఈ మధ్య డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ సారిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో భారీ సంఖ్యలో విచ్చేసిన లబ్ధిదారులకు డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను అందజేశారు. అయితే అనివార్య కారణాలవల్ల కొంతమంది లబ్ధిదారులు సదరు సమావేశానికి హాజరు కాకపోవడంతో మంగళవారం మిగిలిన 90 మందికి కార్పొరేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్లను, ఇంటి తాళాలను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పేదవారి ఇంటి కలను నిజం చేయాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలను అందజేస్తున్న విషయం తెలిసిందే అన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్థానికంగా ప్రత్యేక శ్రద్ధ కనపరచి లబ్ధిదారులకు అనువుగా ఉండే విధంగా అన్ని సౌకర్యాలను మెరుగుపరిచారని చెప్పారు. శ్రావణమాసం నేపథ్యంలో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకొని సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ ఇల్లు లేని పేదవారికి తమ ప్రభుత్వం గుంకలం, సారిక, సారిపల్లి, సోనియా నగర్, కొండకరకాంలలో ఇళ్లపట్టాలను అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పివిడి.ప్రసాదరావు, హౌసింగ్ కమిటీ సభ్యులు కంటుభుక్త తవిటరాజు, మారోజు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అల్లు చాణిక్య, పట్టా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





